Regd. No. H/NL 18
విడిప్రతి 50 పైసలు
శుక్రవారం 23-6-1978

రండి! త్వరపడండి!
రూ. 100 వస్త్రములను కొని
రూ. 15000 ఉచితబహుమతులను
పొందండి
మొదటి బహుమతి
ఆల్విన్ పుష్పక్ స్కూటరు
రెండవ బహుమతి-
టెలివిజన్
ఇంకనూ 50 వివిధబహుమతులు కలవు
పూర్ణా డిపార్టుమెంటల్ స్టోర్స్
సుబేదారుపేట - నెల్లూరు.

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడుగారు
సంపుటి 49 సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి సంచిక 25




# జనతా చీలిక అనివార్యమౌతుందా?

జనతాపార్టీలో చీలిక అనివార్యమేనా? నిన్నటి పరిణామాలు గమనిస్తే అనివార్యమేననిపిస్తుంది. పార్టీ పార్లమెంటరీ బోర్డు నిన్నటి సమావేశంపై అధ్యక్షుడు శ్రీ చంద్రశేఖర్ మీద సంపూర్ణ విశ్వాసం ప్రకటించడంతోపాటు, శ్రీ రాజ్‌నారాయణ్‌ను అరకాటంలో పడవేసింది కూడా! ఇటీవల చంద్రశేఖర్ మీద దుమ్మెత్తిపోసిన విమర్శలకు సంజాయిషీ యివ్వాల్సిందిగా రాజ్‌నారాయణ్‌ను పార్లమెంటరీ బోర్డు కోరింది. ఈ సమావేశానికి చరణ్‌సింగ్ తప్ప మిగతా ముఖ్యనాయకులందరూ హాజరయ్యారు.

తాను ఎవరికీ క్షమాపణ చెప్పుకోనవసరంలేదని, సంజాయిషీ యిచ్చుకొనే ప్రసక్తేలేదని శ్రీ రాజ్‌నారాయణ్ నిర్ద్వంద్వంగా ప్రకటించాడు.

దీంతో ఇవ్వాళ్ళ పార్టీలో నెలకొని వున్న సంక్షోభం పరాకాష్ఠనందుకొన్నట్టు భావించవచ్చు. రాజ్‌నారాయణ్‌ను సంజాయిషీ కోరడమంటే, అది చరణ్‌సింగు మీద యుద్ధం ప్రకటించడమే! రాజ్‌నారాయణ్ చరణ్‌సింగు నమ్మినబంటు; ఆయన తరఫున మాట్లాడే అనుచరుడు. రాజ్‌నారాయణ్ ఏమి మాట్లాడినా, ఏమిచేసినా దానికి చరణ్‌సింగు ఆమోదముద్ర వెంటనే లభించి తీరుతుంది. అంటే పలికెడువాడు రాజనారాయణుడట, పలికించెడివాడు చరణసింగట! పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మీద రాజ్‌నారాయణ్ విరుచుకు పడటం, ఆయన రాజీనామా చెయ్యాలని కోరడం, పార్టీ అధ్యక్షుణ్ణి పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యుల 'ఎలక్టొరల్ కాలేజి' ఎన్నుకోవాలని ప్రతిపాదించడం- ఇదంతా రాజ్‌నారాయణ్ ముఖతః వెలువడిన చరణసింగీయమే! కాబట్టి ఇప్పుడు పార్లమెంటరీ బోర్డు రాజ్‌నారాయణ్‌ను సంజాయిషీ కోరడంతో, పరోక్షంగా చరణ్‌సింగును దెబ్బతీసిందన్నమాట

**మా రాజకీయ పరిశీలకుడు**

మరి దీనికి చరణ్‌సింగు ఆయన బి. ఎల్. డి. శిష్యబృందం ఏ విరుగుడు వేస్తారో వేచిచూడాలి. రాజ్‌నారాయణ్ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదంటూ అప్పుడే చరణ్‌సింగు శిష్యులు ప్రకటిస్తున్నారు. రాజ్‌నారాయణ్ చేసింది తప్పే అయితే, ఆ తప్పు యింకా చాలామంది చేశారని, వారందరిమీదా చర్యతీసుకోకుండా ఒక్క రాజ్‌నారాయణ్‌నే సంజాయిషీ కోరడం సబబు కాదని విమర్శిస్తున్నారు. వీరింకా హర్యానా ముఖ్యమంత్రి దేవీలాల్ కూడా మొరార్జీ, చంద్రశేఖర్ వగైరా నాయకుల్ని తెగ విమర్శించాడు. అతని విషయంలో పార్లమెంటరీ బోర్డు మౌనంగానే వుండిపోవడం గమనించదగిన విషయమే!

పార్లమెంటరీ బోర్డు నిర్ణయం, తర్వాత దానిమీద రాజ్‌నారాయణాదుల ప్రకటనలు తెగతెంపుల ధోరణిలోనే ఉన్నాయి. మధ్యవర్తుల రాజీ ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇరుపక్షాల్లో ఏమాత్రం సడలింపు రాదని తేలిపోయాకనే పార్లమెంటరీ బోర్డు ఈ నిర్ణయానికి వచ్చినట్టుంది. అంటే చరణ్‌సింగుతో ఇక పొత్తుకుదరదనే ఒక నిర్ణయానికి మొరార్జీ తదితర అగ్రనాయకులు వచ్చారన్నమాట. చరణ్‌సింగు కూడా సర్దుకుపోయే మనిషి కాదు; తానుపట్టిన కుందేటికి మూడేకాళ్ళనే తత్వం. అందువల్ల ఇక జనతాపార్టీనుండి పూర్వపు భారతీయ లోక్‌దళ్ విడిపోక తప్పదేమోననుకోవల్సి వస్తూంది.

బి. ఎల్. డి. ఏకతాటిగా విడిపోతుందా, లేక తనతో మరెవరినైనా తోడు తీసుకుపోతుందా అన్నది వేచిచూడాలి. పూర్వపు జనసంఘీయులు చరణ్‌సింగు వర్గంతో ఇటీవల కొంతకాలంగా ఐక్యత్వం నెరిపారు. ఐతే ఇప్పటి సంక్షోభంలో వాజ్‌పాయ్, నానాజీవంటి ముఖ్యులు చంద్రశేఖర్‌నే బలపర్చారు. దీన్నిబట్టి ప్రస్తుతానికి జనసంఘీయులు జనతాపార్టీలోనే ఉండిపోదలచుకొన్నట్టు స్పష్టమౌతుంది. ఐతే అధికారాన్ని కైవసం చేసుకొనే అవకాశం వుంటే, వారు చరణ్‌సింగుతో పొత్తు కలపగలరనే వదంతి కూడా ఉంది.

—కొరత 7 వ పేజీలో

మన నెల్లూరీయులకు

స్పెన్సర్ కంపెనీవారి

ప్రఖ్యాతిగాంచిన నేషనల్ పానీయం

"77" (డబుల్ సెవన్)

తే 23-6-1978 ది శుక్రవారం

విడుదలచేయుచున్నామని తెలుపుటకు సంతసించుచున్నాము.

మార్కెట్‌లో పాపులర్‌గా వున్న స్పెన్సర్స్ ఫ్రూట్ జ్యూసెస్ (మ్యాంగో, గ్రేప్, పైనాపిల్)

'కిశాసో' మరియు సోడాలు మా వద్ద లభించును.

పూర్ణా జనరల్ స్టోర్సు - సుబేదారుపేట - నెల్లూరు.

డోర్ డెలివరీ కావలసినవారు దయచేసి 1516 కు ఫోను చేయండి.

# చెరకు: తెగుళ్లు నివారిస్తే మంచిపంట

చెరకు వాణిజ్యపంటలలో చాలాముఖ్యమైనది. మన భారతదేశంలో 30 లక్షల హెక్టార్ల భూమిలో చెరకు పంటవేసి 1650 లక్షలటన్నుల చెరకును ఉత్పత్తి చేయుట జరుగుచున్నది. ఇటువంటి చెరకు పంటను, అనేక తెగుళ్ళు, పురుగులు ఆశించి పంట పాడగుటయు, దిగుబడి తగ్గుటయు, రసమునాణ్యత తగ్గుటకు కారణమగుచున్నది.

## కాటుక తెగులు

ఈతెగులుసోకిన చెరకుమొవ్వు పొడవైన నల్లటి కొరడా మాదిరిగా మారును. చెరకుగడలు సన్నబడును, ఆకులు సన్నబడి నిటారుగావుండును. ఒక్కొక్కప్పుడు తెగులుసోకిన దుబ్బుల నుండి అమితముగా పిలకలు పుట్టును. ప్రారంభములో ఈ నల్లటి కొరడా ఒకతెల్లని పలుచని పొరలో యిమిడివుండును. తదుపరి ఈ పొరచిట్లి అసంఖ్యాకములైన రోగబీజములు విడుదలయి తెగులులేని చెరకులకు వ్యాపించును.

నివారణ: కొరడాలను నెమ్మదిగాకోసి గోతంలోనింపి, తోటకుదూరంగా తీసుకొనిపోయి పూడ్చాలి. లేదా తగులబెట్టాలి. తర్వాత తెగులుసోకిన దుబ్బులనుకూడ తీసి తగులబెట్టాలి. కార్శితోటను ఒక సంవత్సరంమాత్రమే ఉంచడం మంచిది. తెగులులేని తోటలనుండి విత్తనాన్ని సేకరించాలి. అగలార్ 3 శాతం 500 గ్రా. మందు తీసుకొని 100 లీటర్ల నీటిలో కలిపి ఆ ద్రావణంలో విత్తనాన్ని, 5-10 నిమిషాలు నానవేసి విత్తనశుద్ధిచేయాలి

శ్రీ జి. వెంకటరావు
ప్రాంతీయ పరిశోధనాస్థానం,
నెల్లూరు

## ఎర్రకుళ్ళు తెగులు

చెరకుగడ పైనుండి మూడు లేక నాల్గవఆకు చివర్లపై క్రమంగా ఎండిపోవడం, ఈ తెగులు ప్రారంభలక్షణం. తర్వాత మొత్తంమొవ్వు ఎండి, కృశిస్తుంది. చెరకుగడల సహజతేజస్సుకోల్పోయి ముదరంగు వస్తుంది. గడలను చీల్చి చూచినప్పుడు పుల్లనివాసన వస్తుంది. ఎర్రబడిన కణజాలంమధ్య తెల్లటి మచ్చలుంటాయి. తెగులు ముదిరినపుడు గడలోపల తొర్రలేర్పడి శిలీంధ్రం గూడుకట్టుకునివుంటుంది.

నివారణ: తెగులుసోకిన దుబ్బులను పూర్తిగాత్రవ్వి కాల్చివేయాలి. తెగులులేని తోటలనుండి విత్తనంఎంచి తీసుకోవాలి. చెరకుతోటలలో నీరు నిలువలేకుండ చేయడం, కార్శితోటలు ఒక సంవత్సరం మాత్రమేవుంచుట ఈ వ్యాధిని నిరోధించుటకు ముఖ్యమైనమార్గాలు. తోటలు బాగా పెరిగినతర్వాత ఈ తెగులు కనిపిస్తే వెంటనే నరికి బెల్లం చేయుటగాని లేక ఫ్యాక్టరీకి పంపుటగాని చేయాలి. సాధారణంగా ఈతెగులు కో 975 రకానికిసోకదు. మిగిలిన అన్నిరకాలకు వచ్చుటకు అవకాశం వుంది.

## గడ్డిదుబ్బు తెగులు

కార్శితోటలలో ఈ తెగులు ఎక్కువగా వస్తుంది. ఒక్కొక్కప్పుడు 50శాతం దుబ్బులకు ఈ తెగులు తగులుతుంది. ఈ తెగులు లేతచెరకు దుబ్బులకు సోకినప్పుడు లేత పసుపుపచ్చని లేక చివర్లమైన పిలకలు ఎక్కువగావుట్టును. వాటి ఆకులపై పసుపుపచ్చదనము వచ్చి, ఒక్కొక్కప్పుడు తెల్లనిచారలు కనపడును.

నివారణ: తెగులుసోకిన దుబ్బులను పూర్తిగాతీసి తగులబెట్టవలెను. విత్తనం ముచ్చెలను 50°c గల వేడినీటిలో రెండు గంటలసేపు వుంచి, లేదా 54°c గల వేడిగాలిలో 8 గంటలుంచి, చల్లార్చినతర్వాత నాటాలి. ఈ విధంగా శుద్ధిచేయడం వల్ల మొలకెత్తుట కొద్దిగా తగ్గిపోతుంది. అందుచేత విత్తనం కొంచెం ఎక్కువ వాడాలి.

## పసుపు మచ్చతెగులు

ఈ తెగులు వల్ల ఆకు రెండువైపులందు ఆకు నడిమి ఈనెమీదను ఒక క్రమంగాని, ఒకేపరిమాణంగాని లేని పసుపుమచ్చలుంటాయి. ఈ మచ్చలు ముదిరిన ఆకులపై ఎక్కువగా ఉంటాయి.

నివారణ: కో 975 రకం ఈ తెగులుకు తట్టుకొంటుంది. కో 419, కో 527 రకాలుమాత్రం ఈ తెగులుకు పూర్తిగా లొంగిపోతాయి. పసుపు మచ్చలు కనిపించిన వెంటనే ఒక లీటరు నీళ్ళలో 5 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ గల మందును కలిపి తోటపై పిచికారి చేస్తే ఈ తెగులును సులభంగా నివారించవచ్చు. తెగులు ఎక్కువగావుంటే 15 రోజుల తర్వాత తిరిగి మందుకలిపిన నీళ్ళు

—రెండవ 10 వ పేజీలో

## అక్షర తూణీరం

బెల్‌బాటమ్ పాంటుకింద బూటేస్తాడు
లేడీస్ కాలేజిముందు బీటేస్తాడు
మరోసారి చూదామని మా స్టూడెంటు
మార్చీ సెప్టెంబరులను దాటేస్తాడు.

—నాగభైరవ





అంటే ఏమిటి?
కుటుంబాన్ని సంతోషంగా, ఆరోగ్యంగా ఉంచటమే కుటుంబ సంక్షేమంలో ఉద్దేశ్యం.

ఎందుకు?
ప్రతికాన్పు తర్వాత తల్లి శరీరంలో రక్తం తగ్గిపోతుంది. ఎక్కువ కాన్పుల వల్ల రక్తం బాగా తగ్గిపోయి ప్రమాదకరమయిన జబ్బు ఏర్పడుతుంది.

ఎప్పుడు పాటించాలి?
వివాహ జీవితం ప్రారంభంలోనే కుటుంబ సంక్షేమ చర్యలు తీసుకోవాలి. సరయిన జాగ్రత్తలతో మీరు, మీ పిల్లలు ఆనందంగా ఉండవచ్చు.

ఏవిధంగా?
కుటుంబ సంక్షేమానికి ఏదో ఒక పద్ధతిని ఎన్నికచేయాలి. సంతానంకావాలనుకునేదాకా నిరోధ్, మాత్రలు వాడాలి. ఆ తర్వాత గర్భకోశ సాధనం వాడాలి. ఇద్దరు పిల్లలు కలిగాక మీరు ఇష్టపడి శస్త్రచికిత్స చేయించుకోండి.

కుటుంబ సంక్షేమ పద్ధతులు, సాధనాలు మొ॥ వాటికోసం దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించండి.

అబ్బాయి లేదా అమ్మాయి - పిల్లలు మాత్రం ఇద్దరే!

—davp 77/591

# సుబ్బకృష్ణారావు

[జివపేటికొరవ]

లన్నీ కృష్ణారావుగారే సమర్థవంతంగా నిర్వహిస్తుండేవారు.

1909 లో నెల్లూరులో జరిగిన మొట్ట మొదటి జిల్లా మహాసభలకు ఊ పి రి, ఉత్తేజం అమందర్ల సుబ్బకృష్ణారావుగారే. అప్పటికే ఆయన కాంగ్రెసు సమావేశాలకు హాజరవడం, ఇతరజిల్లాల మహాసభల తీరుతెన్నులను గమనించడంవల్ల, ఆ ఘట్టం లోనే నె. జి. మహాసభలు జరపాలనుకొన్నారు. తొలిమహాసభకు అధ్యక్ష సంఘాధ్యక్షుడు టి. వి. వెంకట్రామయ్యర్, కార్యదర్శి కృష్ణారావుగారు. మరుసటేడు కూడా నెల్లూరులో మహాసభలు జరిగాయి; వాటికీ కృష్ణారావుగారే కార్యదర్శి. ఆ మహాసభలను నెల్లూరుజిల్లా ప్రాంతీయ రాజకీయ చైతన్యానికి నాందిగా భావిస్తే, వాటికి సూత్రధారులైన వారిలో కృష్ణారావు గారు ముఖ్యులు.

ఈజిల్లా మహాసభలకు ముందే నెల్లూరు జిల్లా కాంగ్రెసు సంఘం ఏర్పడింది. దానికి కృష్ణారావు అధ్యక్షుడు. అంటే ఈ నాటి జిల్లా కాంగ్రెసు సంస్థకు మూలపురుషుడు కృష్ణారావుగారేనన్నమాట.

కృష్ణారావుగారు 1913 జనవరి 4 తేది నుండి 1919 దాకా-రెండుసార్లు-మద్రాసు శాసనసభలో సభ్యులుగా ఉన్నారు. తర్వాత 1920 లో జరిగిన సంస్కరణల వల్ల మళ్ళీ రెండుసార్లు - అంటే మరొక ఆరేళ్ళు- శాసనసభ్యుడుగా ఎన్నికయ్యారు.

1920 లో కృష్ణారావుగారికి బ్రిటిష్ ప్రభుత్వం 'రావుబహదూర్' బిరుదమిచ్చి సత్కరించింది. ఆ సంవత్సరమే నెల్లూరు జిల్లాబోర్డుకు తొలిసారిగా ఎన్నికలు జరిగాయి; కృష్ణారావుగారు మొట్టమొదటి జి. బో. అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆయన ఆ పదవికి మొత్తం మూడుసార్లు ఎన్నికై 1920 నవంబరు 11 తేది నుండి, 1929 ఫిబ్రవరి 1 తేదిదాకా అధ్యక్షుడుగా ఉన్నారు. రెండుసార్లు పోటీలేకుండాను, మూడోసారి వెంకటగిరి కుమారరాజాతో పోటీచేసి ఎన్నికయ్యారు.

ఇక మిగిలింది నెల్లూరు మునిసిపాలిటీ. అదీ వదల్లేదు కృష్ణారావుగార్ని! ఆయన 1918 నుండి 1920దాకా నెల్లూరు మునిసిపల్ ఛైర్మన్‌గా ఉన్నారు.

ఇట్లా కృష్ణారావుగారు చిన్ననాటినుంచీ అధికారబాధ్యతలు చేపట్టి, కార్యనిర్వహణా దక్షతనే పేరుతెచ్చుకొన్నారు. ఆయన అందరినీ ఆకట్టుకొంటూ, పొందగలిగినది చేదనడం అతిశయోక్తి కాదు. "ఆయన సుమారు 12½ సంవత్సరముల కాలము చెన్నపురి శాసనసభలో సభ్యులుగానుండి వాగ్గాంభీర్యముచేతను వాదనా కౌశలము చేతను ప్రజల యొక్కయు, ప్రభుత్వము యొక్కయు మెప్పుబడసినవారు... 18 సంవత్సరములకాలము జిల్లాబోర్డు పరిపాలనలో పాల్గొని ఈ జిల్లాకు అఖండయశస్సును సంపాదించినవారు, నెల్లూరుమున్సిపల్ కౌన్సిలరుగా ఆరు సంవత్సరములు పనిచేసినారు. ఇక నెల్లూరు వి. ఆర్. కాలేజి కమిటీ, నెల్లూరు ఫండాఫీసు, నెల్లూరు ప్రొగ్రెసివ్ యూనియన్ ఇలాంటి వివిధ ప్రజాసంస్థలలో నుత్తమస్థానమును వహించి పొందుటచే గౌరవింపబడినారు". (సుబోధిని 1936 డిసెంబరు 5 తేది సంచిక.)

మొత్తమ్మీద కృష్ణారావుగారి రాజకీయ జీవితమంతా 'ఉద్యోగపర్వమే'ననవచ్చు. 1912 ప్రాంతాలనుండి 1930దాకా ఆయన రాజకీయాన్నీ పదవులలోనే సాగాయి. ఇతే పదవులన్నవి ఆనాటి బాధ్యతగానే ఉంచేదికాని, ఇప్పటిమాదిరి 'అనుభవించ' దానికి వస్తే 'అదృష్టయోగం' కాదుగదా? పోతే కాంగ్రెసు '...' లో ఉన్నప్పుడుమాత్రమే ఆయన రాజకీయరంగంలో ప్రముఖంగావున్నారు. ఆ దశ దాటి, పోరాటదశకు వచ్చేసరికి తెరవెనుకకు వెళ్ళారు. ఒక విధంగా ఆయన 'లాయలిస్టు'. స్వాతంత్రోద్యమంలో ఆయనెప్పుడూ పాల్గొనలేదు; జైలుకు వెళ్ళలేదు. పైపెచ్చు బ్రిటిష్ ప్రభుత్వం ప్రసాదించిన 'రావుబహదూర్' బిరుదాన్ని చివరిదాకా పరిత్యజించలేదు. కాంగ్రెసులో కూడా ఆయన మితవాదే. బిపిన్‌చంద్రపాల్ 1908లో నెల్లూరు వచ్చినప్పుడు ఆయన సభను అధ్యక్షించడానికి కృష్ణారావుగారు నిరాకరించారు. ఇతే సభను అధ్యక్షించిన మాడభూషి నరసింహాచార్యుల్ని ప్రశంసించారట.

1930 తర్వాత దాదాపు రాజకీయ సన్యాసం స్వీకరించిన పంతులుగారు ఎందుకోగాని 1937 ఎన్నికల్లో మద్రాసు కౌన్సిలుకు పోటీచేసి అభ్యర్థిగా కాంగ్రెసుతో పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత మళ్ళీ ఆయన రాజకీయాల ప్రసక్తే పెట్టుకోలేదు. 1935లో కాంగ్రెసు స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని, నెల్లూరులో కాంగ్రెసు భవనం నిర్మించాలని ఆయన, శ్రీ ము లా రు శివరామయ్య తదితరులు పూనుకొన్నారు. భవన నిర్మాణ సంఘానికి వారే అధ్యక్ష, ఉపాధ్యక్షులై కొంతడబ్బు వసూలుచేసి, పొగతోటలో స్థలం కూడా సేకరించారు. కాని భవన నిర్మాణం ఎందువల్లనో జరగలేదు. తర్వాత కాంగ్రెసు వారసుల అస్థల తగాదాలు, ఇప్పుడు మొండిగోడలున్న మునిసిపాలిటీ స్థలాన్ని దురాక్రమించుకోవడం, గోడల దాకా ... మాసుకోవడం-అదంతా వేరే కథ. మొత్తంమీద, ఏనాటికైనా నెల్లూరులో జిల్లాకాంగ్రెసు భవనమంటూ ఒకటి ఏర్పడితే దాని మూలస్తంభం కృష్ణారావు.

న్యాయవాదిగా కృష్ణారావుగారు అఖండ మేధాసంపన్నులు. లాయరుగా ఆయన ప్రతిభావిశేషాలను, సమయస్ఫూర్తిని, ఔదార్యాన్ని, పేరుప్రతిష్ఠలను వెల్లడించే పిట్టకథలెన్నో ఉన్నాయి. అవన్నీ ఒకఎత్తు, లండన్ ప్రీవీకౌన్సిల్ ముందు ఆయన లాయరుగా హాజరు కావడం ఒక ఎత్తు.

1938 లో ప్రీవీకౌన్సిల్ ముందు రాజా బహదూర్ ధనరాజగిర్జీకి రాజా పానుగల్లు పార్థసారథి రాయనింవారికి వ్యాజ్యం జరిగింది. ఆ అప్పీలులో ధన్‌రాజగిర్జీ తరఫున న్యాయవాది మన కృష్ణారావుగారు. ఆ రోజుల్లో ప్రీవీకౌన్సిల్‌ముందు భారతీయ న్యాయవాదులు వాదించడానికిలేదు. మన కేసులకు లండన్‌లో ఒక లాయర్ను సొలిసిటర్‌గా నియమించుకొని, ఆయనద్వారా వాదించుకోవల్సివుండేది. మన భారతీయ న్యాయవాదులు ప్రీవీకౌన్సిల్‌లో బ్రిటిష్ న్యాయవాదులకు సహాయకులుగా మాత్రమే వ్యవహరించి, తమకేసులు నడిపించుకొంటుండేవారు. ఇతే ధనరాజ్‌గిర్జీ అప్పీలులో కృష్ణారావుగారే స్వయంగా వాదించారు. ప్రీవీకౌన్సిల్‌ముందు వాదించిన తొలి భారతీయ న్యాయవాది అమందర్ల సుబ్బకృష్ణారావు. ఆ గౌరవం ఆయనదే- ఆయన ద్వారా మనజిల్లాది- దక్కిందన్నమాట.

ఆకేసులో సి. సిడ్నీస్మిత్ అనే న్యాయమూర్తి తీర్పు యిస్తూ కృష్ణారావుగారిని ఇట్లా ప్రశంసించారు: "On the whole I think the Raja should be very grateful to Mr. Krishna Rao for his unending labours in this case. He has not spared himself and he has given us very great help and has left nothing under that could have been done". ఇంతటి పొగడ్త ఒకభారతీయుడికి లభించడం అరుదు - కదు మరి!

కృష్ణారావుగారిజీవితం ఒకసమగ్రమైన గ్రంథం. అందులోని ప్రతిపుటా విశిష్టమైందే; కీర్తిప్రదమైందే!

ఇంతటి మహోన్నతమైన, బహుముఖ ప్రజ్ఞావంతుడైన అమందర్ల సుబ్బకృష్ణారావుగారు తన 62వ యేట 1942 జూలై 4 తేది రాత్రి- కన్నుమూశారు. ఆయనమరణంతో నెల్లూరుజిల్లా సామాజిక రాజకీయచరిత్రలో ఒక ప్రముఖాధ్యాయం పరిసమాప్తమైంది. ఆ మహనీయుని శతజయంతి సందర్భంగా ఇదే మా నివాళి. ✱



